# అందమా.. అందవా..?

ఎక్కడో చీకటి ఖండం నుంచి ఒక్క వెలుగు రేఖ పలుకరించింది. ఆ స్వరంలో ఉద్వేగపు తంత్రులు, తెలుగు మీద ప్రేమ, చెప్పలేకపోతున్నానని వెరుపు, ఏదో చెప్పానని తృప్తి – ఓ తెలియని వ్యక్తి శ్రద్ధగా వింటున్నాడని ఆనందం... ఇవన్నీ లోలోతుల నుంచి ఉబికి వచ్చే సౌందర్యానికి ప్రతీకలు. “ఇన్నర్ గ్లో” ఒక చైతన్యం.. అందానికి నిర్వచనం చైతన్యం. నాలుగేళ్ళ నా మనువరాలు ఎంత చైతన్యవంతంగా సౌందర్యంతో చిప్పిలుతుంటుంది. ప్రతి కదలికా అందానికి అలంకారమే! అప్పుడెప్పుడో ఆమెను కలిసి పగలంతా గడిపినప్పుడు ఆమె ఎంత సౌందర్యవతో.. ఆమె యౌవనంలో ఉన్నప్పటి సౌందర్య రాశి – రాశి పోసినట్లు నా ముందు కూర్చుంది.

నిన్నగాక మొన్న కలిసిన శారదాశ్రీనివాసన్ ఎంతటి స్వర సౌందర్యవతో, ఆమెను ఆవహించి ఉన్న అందాన్ని అనుభూతికి తెస్తుంది. అలా లాబీలో కూర్చుంటే ఉదయపు గాలులు పూల పరిమళాలు మొసుకొస్తుంటాయి. ఆ పరిమాళాల సౌందర్యం ఆఘ్రాణించి అనుభవించాలి. అవన్నీ ప్రాణ వాయువులు – ఒక వీణ మంద్రంగా పలుకరించినప్పుడు – హృదయ తంత్రి గతి తప్పదా – ఒక సితార సన్నటి పిలుపు – వలపులు చిలికించవా? ఒక వేణువు నిస్వానం శ్వాసనింపదా? నా ఒక్క సెల్ కేకతో ‘సెల్ తెరపీ’ లాగా దిగిన ఆ గ్రీకు సుందరి – పాలరాతి మందిరంలా గొడుగుపట్టిన ఆత్మబంధం అందం కాదా? ప్రతి ఉదయం శుభోదయం అంటూ సందేశం పంపే ఆచార్యుని సౌందర్యం సూర్యోదయం లాంటిది కాదా! నిండు నవ్వుతో పలుకరించే రాంబాబు చైతన్యంలో ఎంతటి అందం పొంగుతుంటుంది?

నిన్నగాక మొన్న బెజవాడ – ఆత్మీయ మిత్రుని సంస్మరణ సమావేశంలో మాట్లాడిన వారి విషాదంలో – ఎంతటి అందం అంతర్లీనంగా మిత్రుని జ్ఞాపకాలు ప్రవహించాయి. నాకయితే ఆయన చిలిపి నవ్వులు వినిపించాయి. మరో విచిత్రం అప్పుడే అక్కడే నాకు పరిచయం లేని వ్యక్తి వచ్చి మిమ్మల్ని కలువడానికే వచ్చాను. మీరు రాసే ప్రతి పదం అందంగా ఉంటుంది. ప్రతి భావనా సౌందర్యవంతంగా వెలుగుతుంటుంది. ఇప్పుడు మిమ్మల్ని చూస్తున్నాను. మీ వర్ఛస్సు(?) నన్ను అబ్బురపరుస్తుంది. ఇంకా చాలా చెప్పారు. –

నేను మీ పేరు అని అడగలేదు. ఆయన (పరిచయం లేని) అన్నాను – కానీ ఇప్పుడు వెలిగింది – అది నేనే అని. అలాంటి స్థితిలో నేనెన్ని సార్లు లేను? ఈయన ప్రమోద్‌కుమార్, జగన్నాథరావు, చాట్ల – సిద్ధయ్యనాయుడు – నాగేశ్వర్ రావు – వీరందరూ ఈ రూపంలో పలకరిస్తున్నారు. వీరందరూ అమరులే కదా – అమరులంటే అందమే కదా!!



మొన్న వందేభారత్‌లో...

నాతో ఎన్నో ప్రయాణాలు చేసిన అయ్యవారూ.. మీకు పద్మాలు చూపించనా అన్నాను. ఆయన నవ్వి – మీరు మరీనూ – అని సాగదీసి కాఫీ ఇప్పింతురూ అన్నారు. ఇదిగో అయ్యంగారి పడుచు – ఆ నయన పద్మాలు అవలోకించండి– ‘పద్మదళాల వర్ణశోభితం – సౌందర్యం’ మన ప్రబంధకవులు – ఎంతగా పరికించారో కదా! అవునవును – మీరు మాత్రం తక్కువా? అని చురకలేశారు. ఇంతలో కాఫీ వచ్చింది.

కొస మెరుపు : పార్వతీశ ఖర్వాట సౌందర్యం అమరనాథ్ లింగ సదృశ్యం కాదూ?

